ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 20 సెప్టెంబరు 2025

న్యాయవాదుల విధుల బహిష్కరణ 8



ప్రజాపాలనలో ప్రతీ కుటుంబానికి మేలు 7



పాల నాణ్యత పెంచాలి

డీడీసీఎఫ్ రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత



పాల నాణ్యతను పరిశీలిస్తున్న కవిత

కడ్తాల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ పాల నాణ్యత విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీడీసీఎఫ్ రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి హెచ్. కవిత అన్నారు. పాల నాణ్యత, ఉత్పత్తుల అమ్మకాలను పెంచి పాడి పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. కడ్తాల పాల శీతలీకరణ కేంద్రాన్ని శుక్రవారం జీఎం మధుసూదన్ రావు, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళిలతో కలిసి క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్ణీత మేర పాలలో వెన్నశాతం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత శాతాన్ని పెంచాలని అధికారులకు ఆదేశించారు. పాడి రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు కొనుగోలుదారులకు నాణ్యమైన పాలను అందించేందుకు సంస్థ మరిన్ని చర్యలు తీసుకుంటుందని కవిత పేర్కొన్నారు. ఇకపై పాల సేకరణ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ ప్రాణేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సబియా సుల్తానా



ఎం.చంద్రశేఖర్‌రెడ్డి

పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా సబియాసుల్తానా, చంద్రశేఖర్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కోర్టు సముదాయంలోని రెండు కోర్టులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది సబియా సుల్తానాను, 16వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మరో సీనియర్ న్యాయవాది ఎం. చంద్రశేఖర్ రెడ్డిలను నియమించారు. వీరిద్దరు పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు.



అర లీటరుతోనే సరి..

అర లీటర్ నానో యూరియా బాటిల్ బస్తా యూరియాతో సమానమని అధికారులు చెబుతున్నారు. అవసరానికి మించి ఎరువుల వాడడం వల్ల పెట్టుబడి పెరగడంతో పాటు ఇతర అనర్థాలు జరుగుతున్నాయి. ఏటా వరి, పత్తి, ఇతర ముఖ్యమైన పంటలకు ఎకరాకు రెండు నుంచి రెండున్నర బస్తాల యూరియా వాడాల్సి ఉండగా.. మూడు నుంచి నాలుగు బస్తాలు వినియోగిస్తున్నారు. దీంతో సమతుల్యత లోపించి భూసారం దెబ్బతింటోంది. ఈ కారణంగా పంటలకు తెగుళ్లు పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు క్రిమిసంహారక మందులు వాడుతున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి భారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం వ్యవసాయ రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ పెట్టుబడులను తగ్గించి రైతులకు ప్రయోజనం కలిగించేందుకు గుళికల రూపంలో ఉండే యూరియా, డీఏపీకి బదులు ద్రవరూపంలో ఉండే నానో యూరియా, నానో డీఏపీని అందుబాటులోకి తీసుకువచ్చింది.

నానో.. లాభాలెన్నో!

ద్రవరూప యూరియాతో అధిక దిగుబడి

కొన్నిరోజులుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రైతులను యూరియా కొరత వేధిస్తోంది. వేకువ జాము నుంచే పీఏసీఎస్‌ల వద్ద క్యూ కడుతున్నారు. గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఇలాంటి సమయంలో నానో యూరియా వాడితే మేలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అర లీటర్ నానో యూరియా బాటిల్.. బస్తా యూరియాతో సమానమని అవగాహన కల్పిస్తున్నా రైతులు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. తక్కువ ఖర్చుకే ద్రవ రూపంలో నానో యూరియా, డీఏపీలను ప్రభుత్వం అందిస్తున్నా వాటి వాడకానికి ముందుకు రావడం లేదు. నానో యూరియాపై సరైన అవగాహన కల్పిస్తే యూరియా కష్టాలు తీరే అవకాశం ఉంది.

యూరియా, డీఏపీ కొరతకు ప్రత్యామ్నాయం

అవగాహన లేమితో ఆసక్తి చూపని రైతులు

తక్కువ వ్యయంతో ఎక్కువ ఫలితాలు

ఎనిమిది శాతం అధిక దిగుబడి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అయితే ఎరువుల వాడకం విషయంలో రైతులు సాంప్రదాయ విధానాలనే ఇంకా పాటిస్తున్నారు. రైతులు పోటీ పడి అవసరాలకు మించి పంటలకు ఎరువులను వాడుతున్నారు. ఏటా ఎరువుల వినియోగం పెరిగి అనర్థాలు పెరుగుతున్నా వీటిని తగ్గించే ప్రయత్నాలు జరగడం లేదు. సాంకేతికత మేళవించి తయారు చేసిన ఎరువుల వాడకంలో ఇంకా వెనుకంజలోనే ఉన్నారు. గత కొంతకాలంగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్న విషయం తెలిసిందే. యూరియాకు ప్రత్యామ్నాయంగా

యూరియా వినియోగం (ఎకరాకు కేజీల్లో..)

పంట	అవసరం	వినియోగం
వరి	90	180
పత్తి	90	180
మొక్కజొన్న	135	225
కంది	25	35
కూరగాయలు	30	45

మిగతా 7వ పేజీలో...

గంజాయి పట్టివేత

శంషాబాద్‌రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్ నుంచి హైదరాబాద్ వస్తున్న మహిళ ప్రయాణికురాలి వద్ద 6 కేజీల హైడ్రోపోనిక్ గంజాయిని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన రక్సానా అనీఫ్‌ఖాన్ అనే మహిళ శుక్రవారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. విమానాశ్రయంలో మహిళ అనుమానాస్పదంగా తిరుగుతోంది. అయితే అక్కడే ఉన్న డీఆర్ఐ అధికారులు ఆమె బ్యాగులు తనిఖీలు 6 కేజీల హైడ్రోపోనిక్ గంజాయి ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడి నుంచి తీసుకొస్తున్నావ్? దీని వెనకల ఎవరు ఉన్నారు? ఎన్ని రోజుల నుంచి దందా కొనసాగుతోంది? నగరంలో ఎవరికి సప్లై చేస్తున్నారు? అనే అంశాలపై డీఆర్ఐ అధికారులు విచారణ చేస్తున్నారు. పట్టుకున్న గంజాయిని సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఆర్ఐ అధికారులు వెల్లడించారు.

స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కావాలి



కందుకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహీ సేవలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో సరిత కోరారు. శుక్రవారం మండల కేంద్రం(కొత్తగూడ)లోని కస్తూర్బాగాంధీ బదిరుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో పచ్చదనం, పరిశుభ్రతను పాటించాలన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పచ్చదనం, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేదం అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తీగల భార్గవి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.



దివ్యాంగులకు దసరా కానుక

షాద్‌నగర్‌కు సదరం సెంటర్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే వీర్లపల్లి

వచ్చే నెలలో అందుబాటులోకి..

జిల్లాలో ప్రస్తుతం రెండు సదరం కేంద్రాలు

జిల్లాలో సుమారు 50వేల మంది దివ్యాంగులు

25వేల మందికి పింఛన్

మరో 24వేల మంది దరఖాస్తు

షాద్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీప కబురు అందించారు. ఎప్పుడెప్పుడా అని కొన్నేళ్ల నుంచి ఎదురుచూస్తున్న సదరం సెంటర్‌ను షాద్‌నగర్‌కు మంజూరు చేయించి దివ్యాంగులకు దసరా కానుక అందించారు. పింఛన్లు అందించడంలో తలెత్తుతున్న ఇబ్బందులు, కొత్త దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలకు సంబంధించి ఇక్కడి నుంచే వాటిని పరిష్కరించుకునేందుకు ఆన్‌లైన్ పద్ధతిని కూడా అందుబాటులోకి తెచ్చారు. షాద్‌నగర్‌లో సదరం సెంటర్‌ను ఏర్పాటు చేయాలంటూ గత పదేళ్లుగా ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నా అమలుకు నోచుకోలేదని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించి షాద్‌నగర్‌లో సదరం సెంటర్‌ను ఏర్పాటు చేయించి అక్టోబర్ మొదటి వారంలోనే సెంటర్‌ను ప్రారంభించడం పట్ల జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) సంఘం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 50వేల మంది..

జిల్లాలో 50వేల మంది దివ్యాంగులున్నారు. వీరికి పింఛన్, ఇతర సంక్షేమ పథకాలను అందించడానికి హైదరాబాద్‌లోని కొండాపూర్, వనస్థలిపురంలో రెండు సదరం కేంద్రాలు

మిగతా 8వ పేజీలో...

దివ్యాంగులకు చేయూత

దివ్యాంగులకు చేయూత అందించాలన్నదే నా సంకల్పం. ప్రతి చిన్న విషయానికి హైదరాబాద్ వెళ్లాలంటే వారు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇది చూసి చలించిపోయాను. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి షాద్‌నగర్ పట్టణంలో సదరం కేంద్రాన్ని మంజూరు చేయించాను. ఇకనుంచి వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వెంటనే పింఛన్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తా. సదరం కేంద్రాన్ని మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

గ్రామాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేస్తోందని, కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.5 లక్షలతో వేయనున్న సీసీ రోడ్డు పనులను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల మున్సిపాల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, జిల్లా నాయకులు ఆంజనేయులుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, దేవుని శర్వలింగం, శ్రీనివాస్‌గుప్తా, వెంకట్‌రెడ్డి, డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కృష్ణగౌడ్, సీహెచ్ వెంకటేశ్, బక్కరెడ్డి యాదిరెడ్డి, చామంతి శివారాజ్, గోపాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే వ్యవహారం హాస్యాస్పదం

కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే తానే తెచ్చినట్లు చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య చెప్పుకోవడం హాస్యాస్పదమని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆరోపించారు. చేవెళ్లలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాలకు సీఆర్ఐఎఫ్ నిధులు రూ.169 కోట్లు వివిధ రోడ్ల అభివృద్ధికి గత మార్చిలో విడుదలైతే ఆ నిధులు తానే తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతల స్వప్రయోజనాల కోసం ట్రిపుల్‌ఆర్ రోడ్డులో మార్పులు చేయటం సరైన పద్ధతి కాదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, మాణిక్యరెడ్డి, వెంకట్‌రెడ్డి, డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి ఉన్నారు.

స్కావెంజర్ల జీతాల స్కాంపై విచారణ జరగాలి

ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న నాయకులు

మహేశ్వరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు రంగారెడ్డి జిల్లాకే ఆదర్శంగా నిలిచిన మహేశ్వరం ఆదర్శ పాఠశాల ప్రస్తుతం విద్యాబోధనలో వెనుకబడడమే కాకుండా అవినీతి అక్రమాల ఆరోపణలను ఎదుర్కొంటుందని, పాఠశాలపై వస్తున్న ఆరోపణలపై కలెక్టర్ స్వయంగా విచారణ జరపాలని ఎమ్మెస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబుమాదిగ డిమాండ్ చేశారు. మహేశ్వరం మోడల్ స్కూల్లో స్కావెంజర్ల జీతాల్లో స్కాం జరిగిందని వస్తున్న ఆరోపణలపై శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మహేశ్వరం ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా పత్రికలతోపాటు సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఆయన పొంతనలేని సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. అంతేగాక విషయాన్ని ఎంఈవో, డీఈవోలకు చెప్పానని తెలుపడం అనుమానాలు తావిస్తోందన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం ఇన్‌చార్జి బక్కని రవి, ఎర్ర గణేష్, జంగయ్య, అర్జున్, కృష్ణ పాల్గొన్నారు.

శ్మశానవాటికలను శుభ్రం చేయండి

కంపచెట్లు లేకుండా చూడాలి

నీటి వసతి కల్పనపై దృష్టి సారించాలి

జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి ఆదేశం

స్పందించిన డీఎల్‌పీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) శ్మశాన వాటికల్లో వసతుల లేమిపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'చచ్చినా కష్టాలే.!' కథనానికి జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి స్పందించారు. శ్మశాన వాటికల వివరాలను తెప్పించుకొని వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యాచారం మండలంలోని శ్మశానవాటికల్లో కంపచెట్లు లేకుండా చేయాలని ఉపాధి హామీ పథకం ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డిని ఆదేశించారు. నీటి వసతి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్మశాన వాటికల వద్ద వనమహోత్సవంలో భాగంగా నీడనిచ్చే మొక్కలు నాటాలని ఉపాధి హామీ పథకం అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో రాధారాణి ఉన్నారు. కాగా ఇదే అంశంపై డీఎల్‌పీవో సాధన, ఎంపీవో శ్రీలత స్పందించారు. శ్మశాన వాటికలలో పెరిగిన కంపచెట్లను తొలగించాలని పంచాయతీ కార్యదర్శులను వారు ఆదేశించారు. తరచూ శ్మశాన వాటికలను సందర్శించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'తాగునీటి కోసం తంటాలు' అనే శీర్షికన వచ్చిన కథనం క్లిప్పింగ్‌ను యాచారం పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్యకు పంపించారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

డీసీపీ సునీతారెడ్డి



మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఆదిభట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీసుల పనితీరు బాగుందని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఏసీపీ కేపీవీ రాజుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీసు స్టేషన్‌లో 17 నియమాలను తప్పక అమలుపరచాలన్నారు. ఇటీవల ఫోన్లు దొంగలించి డబ్బులు డ్రా చేస్తున్నారని, వీటిపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు, యువత ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా కాలేజీల్లో సదస్సులు నిర్వహించాలన్నారు. గేటెడ్ కమ్యూనిటీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్సైలు వెంకటేష్, నోయెల్ రాజ్, సైదయ్య, సత్యానారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలు కొత్తవి ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న మెప్మా అదనపు డైరెక్టర్ మురళీమోహన్

రంగారెడ్డి/యాచారం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో కొత్త మహిళా సంఘాల ఏర్పాటుతో పాటు వీధి వ్యాపారాలు చేసుకునేందుకు అందించే రుణాల టార్గెట్‌ను పూర్తిచేయాలని మెప్మా అదనపు డైరెక్టర్ మురళీమోహన్, మెప్మా స్టేట్ అధికారి కృష్ణ చైతన్య పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 18 మునిసిపాలిటీలలో పనిచేస్తున్న టౌన్‌మిషన్ కో-ఆర్డినేటర్లు డాటా ఎంట్రీ ఆపరేటర్లు, రిసోర్స్ పర్సన్‌లకు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ జి.వెంకటనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మెప్మా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. జిల్లా అధికారులు ఇందిర, అశోక్ ఉన్నారు.

ఉబికివస్తున్న గంగమ్మ

పెద్దేముల్, సెప్టెంబరు 19(ఆంధ్ర జ్యోతి): ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. దీంతో గంగమ్మపైపైకి ఉబికివస్తోంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి శివారులోని పోచారం మల్లప్ప వ్యవసాయ పొలంలోని బోరులో కొద్ది రోజులుగా నీరు ఉవ్వెత్తున ఉబికివస్తోంది. మోటారు ఆన్ చేయకుండానే నీరోస్తుడంతో ఆ రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. గతంలో ఒకసారి ఇలాగే నీరు ఉబికి నీరొచ్చిందని, భారీ వర్షాలు కురిస్తే బోరులోంచి నీరు ఉప్పొంగి వస్తుందని రైతు వివరించారు.



తట్టేపల్లిలో బోరులోంచి ఉబికి వస్తున్న నీరు

అంచనాలు సిద్ధం చేయాలి

● 'గొలుసు కట్టు..ఆయువు పట్టు'కథనంపై ఎమ్మెల్యే స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): కాకతీయ కాలంలో రైతులకు జీవనాధారమైన గొలుసుకట్టు చెరువుల నీటి మళ్లింపుకు సర్వే చేయించి అంచనాలతో పూర్తి రిపోర్టును తయారు చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న ప్రచురితమైన గొలుసుకట్టు.. ఆయువు పట్టు కథనానికి ఆయన స్పందించారు. దీంతో అదనంగా 15 వేల ఎకరాలు సాగులోకి వస్తుందని అంచనా ఉన్నప్పుడు కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద ఉన్న నీటిని చెరువులకు మళ్లించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతోపాటు శాసనసభ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు

పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ బదిలీ

పరిగి,సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిగి ఆర్టీసీ డీఎం సుఖేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆరుమాసాల క్రితమే వచ్చిన ఆయన హైదరాబాద్ డిపోకు బదిలీ అయ్యారు. హైదరాబాద్-2 డిపోలో పని చేస్తున్న కృష్ణమూర్తి పరిగికి పోస్టింగ్ ఇచ్చారు. రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం సిగ్గుచేటు

బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య



వికారాబాద్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు, విద్యార్థులు

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన సంవత్సరంలోపే రీయింబర్స్‌మెంట్ నిధులన్నీ చెల్లిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు రోడ్డెక్కినా స్పందించక పోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య ఆరోపించారు. శుక్రవారం వికారాబాద్‌జిల్లా కేంద్రంలో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. పోలీసులు ధర్నా చేస్తున్న వారిలో నలుగురుపై కేసు నమోదు చేసి స్టేషన్‌బెయిల్ అందించారు. జుబేర్, అజయ్ సర్ఫరాజ్, పర్వేజ్, సురేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

24 లోపు నివేదిక అందజేస్తాం

వికారాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కేటగిరీల వారీగా ఓటర్ల నివేదికను ఈనెల 24లోపుసమర్పిస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం ఓటరు జాబితా విధి విధానాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగాఅదనపు కలెక్టర్ మాట్లాడుతూ గడువులోగా పూర్తి సమాచారాన్ని ఎస్ఐఆర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

నానో.. లాభాలెన్నో!

(ఐదో పేజీ తరువాయి)

తక్కువ ఖర్చుకే ద్రవరూపంలో నానో యూరియా, డీఏపీలను ప్రభుత్వం అందిస్తున్నా రైతులు మాత్రం దీనిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వీటిపై రైతులకు సరైన అవగాహన కూడా కల్పించకపోవడంతో రైతులు ఇంకా పాత పద్ధతులనే ఎంచుకుంటున్నారు. వాస్తవానికి 2022 నుంచి ఉమ్మడి జిల్లాలో నానో యూరియా వాడకాన్ని అమల్లోకి తెచ్చారు. అయితే రైతులకు తగిన విధంగా దీనిపై అవగాహన కల్పించకపోవడంతో రైతులు గుళికల రూపంలో ఉన్న యూరియా వాడకానికే మొగ్గు చూపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు సమావేశాలు పెట్టి నానో యూరియా వాడాలని సూచిస్తున్న రైతులు ససేమిరా అంటున్నారు. అవగాహన లేకపోవడంతోనే రైతులు నానో యూరియాపై ఆసక్తి చూపడం లేదు. గుళికల రూపంలో ఉండే యూరియా మార్కెట్‌లో దొరకకున్నా వాటికోసం గంటల తరబడి క్యూలో పడిగాపులు పడుతున్నారు. కానీ అందుబాటులో ఉన్న ద్రవరూపంలోని నానో వైపు ఆసక్తి చూపడం లేదు. పైగా నానో వాడకం పెంచాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ఇలా యూరియా కొరత సృష్టిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

తగ్గనున్న వ్యయం

సాంకేతికంగా అభివృద్ధి చేసిన 'నానో' ఎరువులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇవి నానో టెక్నాలజీతో అభివృద్ధి చేసిన నూతన ద్రవ పదార్థాలు పర్యావరణానికి అనుకూలమైన ఈ నానో యూరియా, నానో డీఏపీకి తక్కువ పరిమాణం ఉండడంతో ఎలాంటి రవాణా ఖర్చులు ఉండవు. దీంతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. బస్తా యూరియాలోని పోషకాలన్నీ ఒక చిన్న సీసా (అరలీటరు)లోనే ఇమిడి ఉంటాయి. వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు 94 రకాల పంట లకు దీన్ని పిచికారీ చేసుకోవచ్చు. నానో యూరియాను లీటరు నీటికి 4మి.మీ చొప్పున కలిపి వాడుకోవాలి. అరలీటరు సీసాను చేతిలో పట్టుకుని రైతు వెళ్లవచ్చు. రవాణా ఖర్చు కూడా ఉండదు. సీసాను నిల్వ చేయడం కూడా సులువే. గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన అవసరం లేదు. నానో యూరియాను కొన్ని పురుగు మందులతో కలిపి పిచికారీ చేయడానికి వీలు లేదు. దీన్ని గమనించి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. గుళికల రూపంలోని ఎరువును 30శాతమే పంట గ్రహిస్తుంది. అదే నానో రూపంలో అయితే 80శాతం గ్రహిస్తుంది. అలాగే వాయు, నీటి కాలుష్యం తగ్గుతుంది. ప్రస్తుతం 45కిలోల యూరియా బస్తాలో ధర రూ.266 కాగా, నానో అర లీటరు సీసా ఖరీదు రూ.240. ఇది యూరియా బస్తాతో సమానం. దీని వాడకం వల్ల 8శాతం ఎక్కువ దిగుబడి వస్తున్నట్లు పరిశోధనల్లో తేలిందని వ్యవసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంటలు చురుకైన దశలో ఉన్నప్పుడు ఆకులపై పిచికారీ చేస్తే సరిపోతుంది. మొదటి స్ప్రే చేసిన 20 నుంచి 25 రోజుల తరువాత రెండోసారి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. అలాగే డీఏపీ ప్రస్తుత ధర రూ.1350 కాగా నానో డీఏపీ రూ.600కు లభ్యమవుతుంది.



మాట్లాడుతున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

సమస్యలు పరిష్కరించాలి

కడ్తాల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి కూలీలు, సిబ్బంది న్యాయమైన సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట కడ్తాల్, ఆమనగల్లు, మైసిగండి ఆశ్రమ పాఠశాలల డైలీ వర్కర్స్, సిబ్బంది చేపట్టిన సమ్మె శిబిరాన్ని 8వ రోజు శుక్రవారం లక్ష్మీనర్సింహారెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, బీసీ సంఘం మండలాధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్, నాయకులు లాయక్‌అలీ, నర్సింహ, రాములు, దాసు, పాండు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



యాచారంలో మొక్క నాటుతున్న జెడ్పీసీఈవో కృష్ణారెడ్డి

యాచారం. సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యాచారం ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి విద్యార్థి రెండు మొక్కలు నాటి వాటిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న గదుల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం స్వచ్ఛతపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

మారుతున్న అభ్యసనల ప్రకారం బోధన ఉండాలి

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు మారుతున్న అభ్యసన ప్రక్రియలకు అనుగుణంగా బోధన అందించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ మండల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం వికారాబాద్ మండల శాఖ అధ్యక్షుడు రాఘవేందర్ గుప్తా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నిరంతరం తపిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జాక వెంకటేశం, సంతోష్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజ్, ప్రసాద్‌కుమార్, కృష్ణారెడ్డి, మల్లేశం స్వామి, నర్సిములు, సురేందర్ రెడ్డి, సంగమేశ్వర్ ఉన్నారు.

8వ వేతన కమిషన్‌ను అమలు చేయాలి



ధర్నా చేస్తున్న రైల్వే కార్మికులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వెంటనే 8వ వేతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఘట్‌కేసర్ బ్రాంచి కార్యదర్శి బొల్లేపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జాతీయ రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం ఘట్‌కేసర్‌లో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కమిషన్ విధి విధానాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, అన్వేష్, రవి, జక్కిబాబు, శ్రీనివాస్, జ్ఞానేశ్వరీ, అనసూయ ఉన్నారు.

షాద్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో శుక్రవారం రాత్రి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, రూరల్ సీఐ నర్సయ్య, డీఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మూడు ఎక్సైజ్ కేసులు, మూడు గుట్కా కేసులు, 13 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, నాలుగు ఆరుబయట మద్యం సేవించే కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.


సీఎంఆర్‌ఎఫ్ పేదలకు భరోసా

కొందుర్గు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ పేదలకు భరోసాగా నిలుస్తుందని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుల చేతుల మీదగా లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం కొందుర్గు మండల కేంద్రం శివారులోని హాజరత్ శాలి హలి బాబా దర్గాలో ఎమ్మెల్సీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట రాజేష్ పటేల్, శ్రీధర్ రెడ్డి, టేకులపల్లి చెన్నారెడ్డి, రవీందర్ రెడ్డి, రామకృష్ణ, బాబూరావు, సందీప్, గొల్ల వేణు, రవీందర్ గౌడ్, హనుమంతు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

యాచారం బడికి ప్రహరీ నిర్మించండి

యాచారం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులతో కలిసి రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డికి వినతిపత్రం అందించారు. విద్యార్థులు తరచూ రోడ్డుపైకి వెళ్తున్నారని చెప్పారు. వినతిపత్రాన్ని కోదండరెడ్డి వాట్సాప్‌లో రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి పంపించి ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. నీటి వసతి కల్పించడానికి పాఠశాలలో ఒక బోరు వేయించాలని కోదండరెడ్డి కోరడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

వైద్యశిబిరం విజయవంతం



యాచారం: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆమనగల్లు/యాచారం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు షైమునా బేగం, మంజులాదేవిలు శిబిరాన్ని ప్రారంభించారు. మధుమేహ, క్యాన్సర్, టీబీ, దంత, కంటి, రక్తహీనత, మాతా శిశు సంరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. 241 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే యాచారం ప్రభుత్వాసుపత్రిలో చిన్నపిల్లలను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మహిళలు, గర్భిణీలకు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. అక్టోబరు 3వరకు గైనాకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు సేవలందిస్తారని ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ ప్రియాంక తెలిపారు. శిబిరాన్ని డీఎంహెచ్‌వో సుధామాధవి సందర్శించి సూచనలు చేశారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/కొత్తూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అర్థాంతరంగా నిలిపివేసిన పనులను హెచ్‌ఎండీఏ ద్వారా రూ.10 కోట్లు సమకూర్చి పనులను పూర్తి చేస్తున్నామన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరు చేసిందన్నారు. హెచ్‌ఎండీఏ ద్వారా మంజూరైన రూ.10 కోట్లతో నందిగామ మండలం శ్రీనివాసులగూడలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు, కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామంలో తొమ్మిది సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.90లక్షలు, ఇన్ముల్‌నర్వ నుంచి జేపీ దర్గా రోడ్ల నిర్మాణానికి రూ.కోటి, జేపీ దర్గాలో కార్యాలయం, మల్టీపర్పస్ బిల్డింగ్, గదుల నిర్మాణానికి రూ.1.50 కోట్లు, జేపీ దర్గా, ఇన్ముల్‌నర్వ మధ్య రూ.40లక్షలతో సీసీ రోడ్డు, చౌదరిగూడ మండలం గుర్రంపల్లి - రావిర్యాల బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.3.50 కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు. మహిళలు ఉపాధి పనులు నేర్చుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి తన నెల జీతం రూ.2లక్షలను విరాళంగా సయ్యద్ సుల్తానా ఎడ్యుకేషనల్ సొసైటీకి అందజేశారు. ఈ సొసైటీ ద్వారా మహిళలకు శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా ఎదిగేలా సొసైటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, పార్టీ సీనియర్ నేత రఘునాయక్, కృష్ణారెడ్డి, బాలరాజుగౌడ్, ఎండీ ఇబ్రహీం, అగ్గనూరు బస్వం, పురుషోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగాలి

విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూర్ మండల పరిధిలోని పెంజర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, ప్రధానోపాధ్యాయులు రఘుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రోబోటిక్ మేళా

500 మంది విద్యార్థులు.. 100కు పైగా ప్రదర్శనలు



విద్యార్థులు రూపొందించిన రాకెట్ నమునాను పరిశీలిస్తున్న నిర్వాహకులు

కడ్తాల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కడ్తాల్ ఫార్చ్యూన్ బటర్ ఫ్లై పాఠశాలలో శుక్రవారం స్వచలిత్ ప్రజ్ఞ కల్ప(రోబోటిక్ రెవల్యూషన్) మేళా కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకుడు శేషగిరి రావు జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించారు. ఇందులో 500ల మంది విద్యార్థులు 100కు పైగా నమూనాలను ప్రదర్శించారు. ఇస్రో రాకెట్స్, బ్రహ్మోస్ క్షిపణి నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పర్యాటకులపై పహల్గామ్‌లో దాడి, ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. నిత్యజీవితంలో గణితం, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధి, సామాజిక సంక్షేమం, సుస్థిర అభివృద్ధి, భవిష్యత్‌లో రోబొటిక్, ఏఐ వినియోగం గురించి వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఋతులు, అధిక దిగుబడుల సాధన, బహుళార్థక ప్రాజెక్టులపై విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సహ వ్యవస్థాపకుడు రమేశ్, ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, కోఆర్డినేటర్ శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అశోక్‌రెడ్డి, క్రాంతికుమార్, రజాక్, నవీన్

ఎస్టీయూ నూతన కార్యవర్గాలు

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండలాల నూతన కార్యవర్గాలను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమనగల్లు పట్టణంలో ఎస్టీయూ నాయకులు సమావేశమై సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ఆమనగల్లు మండల శాఖ అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పున్న సత్యవాణి, ప్రధాన కార్యదర్శిగా శ్రీలత, సహ కార్యదర్శిగా వనిత, ఆర్థిక కార్యదర్శిగా సుజాత, క్రీడా కార్యదర్శిగా అపరంజిత, సభ్యులుగా మాధవీలత, జిల్లా కౌన్సిలర్‌గా భార్గవి ఎన్నికయ్యారు. తలకొండపల్లి మండల అధ్యక్షుడిగా క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడిగా ఎండీ రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా జె.హతిరామ్, సహ కార్యదర్శిగా డి.లత, ఆర్థిక కార్యదర్శిగా శోభారాణి, జిల్లా కౌన్సిలర్‌గా బాల్‌నర్సింహులు ఎన్నికయ్యారు. కడ్తాల మండల అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్, ఉపాధ్యక్షులుగా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గోవర్దన్, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా వీహెచ్ పెవి సీస్‌లు ఎన్నికయ్యారు. మాడ్గుల మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా నవీన్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, కళావతి, ప్రధాన కార్యదర్శిగా విఘ్నేశ్వర్, సహ కార్యదర్శులుగా సురేశ్‌నాయక్, శశిరెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా కృష్ణ, మహిళా కార్యదర్శిగా జయప్రద, క్రీడాకార్యదర్శిగా లావణ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా శ్రీను, లక్ష్మణ్, నందన, పాండులు ఎన్నికయ్యారు.

గురువులు సమాజ మార్గదర్శకులు



సన్మానం పొందిన టీచర్లతో ఎంఈవో పాండు, పాపిశెట్టి రాము

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ సమాజ నిర్మాణానికి గురువే గొప్ప మార్గదర్శి అని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎంఈవో పాండులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మానస గార్డెన్స్‌లో శుక్రవారం సాయిరామ్ మెడికల్ హాల్, సాయిరామ్ ఆప్టికల్స్ సహకారంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఎంఈవో పాండు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి పాపిశెట్టి రాము ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల పరిధిలోని టీచర్లను రాముశ్వేత దంపతులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ప్రిన్సిపాల్ మాధవరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లేశ్, అశోక్‌రెడ్డి, సరస్వతి, స్వాతి, హెచ్‌ఎంలు రామలక్ష్మి, పద్మ, చందూలాల్, పద్మజ్యోతి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అందించాలి

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ అన్నారు. శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. మల్లేశ్, జిల్లా కార్యదర్శి కిషన్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనంతో పాటు రూ.10 లక్షల ఇన్సూరెన్స్, కాల పరిమితి ముగిసినవారికి రూ.2లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సామ్యేల్, అధ్యక్షుడిగా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా మధు, కోశాధికారిగా నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా ఇందిర, జయేందర్, యాదమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, సహాయ కార్యదర్శిగా సుజాత, సలహాదారుడిగా నాగేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంపత్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా దశరత్, సీహెచ్ స్వామి, గోపాల్, అక్షిత్, రవిని ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులుగా సువర్ణ, నీలమ్మ, చంద్రయ్య, సాగర్, సంజీవ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ప్రతీ కుటుంబానికి మేలు

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరిగి ప్రజలంతా సంతోషంగా ఉన్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, శంకర్, శేఖర్‌గౌడ్, సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా జగదీశ్

కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు మున్సిపాలిటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పట్టణానికి చెందిన మల్లేపాకుల జగదీశ్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే కసిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీశైలం, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు బీచ్యనాయక్, షాబోద్దీన్, తదితరులు ఉన్నారు.

భారతీయ జ్ఞాన వ్యవస్థపై జాతీయ సదస్సు



సదస్సులో యునెస్కో పాలకమండలి చైర్మన్ బీపీ శర్మ

ఖైరతాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆధునిక శాస్త్ర సాంకేతికత రుగ్వేద, యుజుర్వేదాలలో నిబిడీకృతమై ఉన్నాయని యునెస్కో ఎంజీఐఈపీ పాలక మండలి చైర్మన్ ప్రొఫెసర్ బీపీ శర్మ అన్నారు. నందిగామలో సింబయోసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం 'ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్' అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఇందులో భారతీయ జ్ఞానవ్యవస్థ, సమకాలీన శాస్త్రీయ, ఆర్థిక, వ్యాపార లక్ష్యాలు అనే అంశంపై శర్మ మాట్లాడుతూ రుగ్వేద, యజుర్వేదాలలో ప్రస్తుత అత్యాధునిక పోకడలను శాస్త్రీయంగా బోధించారని తెలిపారు. పార్లమెంటు మాజీ సభ్యుడు పవన్ వర్మ, సింబయోసిస్ సంచాలకులు ప్రొఫెసర్ వేణుగోపాలరావు, న్యాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సునీల్ జార్జ్, ఎస్ఐటీ డైరెక్టర్ డాక్టర్ రజనీకాంత్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించరా?

టీపీఆర్‌ఎంఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై సంబంధిత ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రి దృష్టి సారిస్తే మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తామని తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం (టీపీఆర్‌ఎంఈఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్ అన్నారు. తమ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఏర్పాటుచేసిన మండలాల్లో ఇప్పటివరకు కొత్త పోస్టులు మంజూరు కాలేవని, తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై సిబ్బందిని అక్కడకు పంపించి పనులు కొనసాగేలా చేస్తున్నారే తప్ప ప్రభుత్వం నుంచి కొత్తగా పోస్టులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొత్తగా ఏర్పాటైన మండలాలకు అన్ని పోస్టులు మంజూరు చేసి, ఖాళీగా ఉన్న స్థానాల్లో సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా, జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. 150కు పైగా ఖాళీగా ఉన్న ఎంపీడీవో పోస్టులను పదోన్నతుల ద్వారా వెంటనే భర్తీ చేయాలన్నారు.

రేడియల్ రోడ్డు నిర్మాణం వద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పరిగి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలం రంగాపూర్ నుంచి శంషాబాద్ వరకు నిర్మించతలపెట్టిన రేడియల్ రోడ్డుకు వ్యతిరేకంగా స్థానిక రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రంగాపూర్ రైతు వేదిక వద్ద భూములు కోల్పోతున్న రైతులంతా సమావేశమై నిరసన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుకు సంబంధించి గుగూల్‌లో సర్వే రిలీజ్ చేయడం ఆందోళనకు గురి చేసిందని రైతులు వాపోయారు. ఇప్పటికే ఉన్న రోడ్డును వెడల్పు చేస్తే సరిపోతుందని, 330 ఫీట్ల రోడ్డు వేయడం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. పూడూరు మండలం దామగుండంలో నిర్మిస్తున్న నేవీ రాడార్ ద్వారా పుణ్యక్షేత్రం పరిసరాల్లో ఉన్న పచ్చని చెట్లు లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేవీ రాడార్‌ను తీసుకొచ్చి ఇక్కడి అడవులను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేవీ రాడార్ నిర్మాణానికి అడవులు నశించడంతోపాటు, రేడియల్ రోడ్డు కోసం రైతుల భూములు పోవడం తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు కోరారు.

ప్రభుత్వం స్పందించే వరకూ పోరాడుతాం

కొనసాగుతున్న భూ నిర్వాసితుల దీక్షలు

కడ్తాల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్పందించే వరకు తమ పోరాటాన్ని పోరాటం కొనసాగిస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ భూ నిర్వాసితులు, నాయకులు స్పష్టం చేశారు. కడ్తాల మండల కేంద్రాన్ని అనుసరించి పచ్చటి పంట పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్న 765 కేవీ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 12వ రోజుకు చేరింది. దీక్షలో భూ నిర్వాసితులు, నాయకులు బాచిరెడ్డి రవీందర్ రెడ్డి, బాచిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, వెంకట్రాములు గౌడ్, వెంకటేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణ, పెంటారెడ్డి, అభిషేక్ రెడ్డి, క్యాతిక కృష్ణ, రాములు, లాయక్‌అలీ, వెంకటేశ్ పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు తొలగింపు



చెట్టును తొలగిస్తున్న పోలీసులు

కేశంపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గాలిదుమారంతో రోడ్డుపై కూలిన చెట్టును పోలీసులు తొలగించి శభాష్ అనిపించుకున్నారు. వివరాలలోకి వెళ్తే.. కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట - మక్తమాదారం ప్రధాన రహదారిపై సంతాపూర్ శివారులో గురువారం రాత్రి గాలిదుమారానికి ఓ పెద్ద చెట్టు విరిగి రోడ్డుపై అడ్డంగా పడింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నలిచిపోయాయి. శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న కేశంపేట కానిస్టేబుళ్లు పురుషోత్తం, కిరణ్ సంతాపూర్ గ్రామ యువకుల సహకారంతో డోజర్ తెప్పించి చెట్టును తొలిగించారు. వాహనదారులు, గ్రామస్తులు పోలీసులను అభినందించారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి

ధారూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం అన్నారు. శుక్రవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ముగ్గురు రైతులకు నాణ్యమైన కంది, వరి, జొన్న విత్తనాలను పంపిణీ చేసి సాగు చేయించామని చెప్పారు. పంట పూర్తయిన తర్వాత ఆ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పవన్ చంద్రారెడ్డి, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి, ఏడీఏ వెంకటేశం, ఏవో సూర్య ప్రకాష్, ఏఈవోలు సంజూ రాథోడ్, సంతోష్, రైతులు ఉన్నారు.

రోడ్డును బాగు చేయాలి

కందుకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆరోగ్య కేంద్రం ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని మండల వైద్యాధికారి హుమేరా సుల్తానాతో కలిసి పరిశీలించారు. నీరు నిలవడంతో రోగులతో పాటు స్థానికులు నిత్యం ఇబ్బందులకు గురౌతున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ వద్ద వర్షపు నీటిని పరిశీలిస్తున్న బాల్‌రాజ్ తదితరులు



ఉత్తమ టీచర్లకు సన్మానం

చేవెళ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న దయానందం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా, అలాగే ప్రధానోపాధ్యాయురాలు లీలారాణి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక అయ్యారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలోని ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

యూపీ ప్రభుత్వ తీరుపై ముస్లింల నిరసన

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో మిలాద్-ఉన్-నబీ సందర్భంగా మహ్మద్ ప్రవక్త పేరుతో బోర్డులు ఏర్పాటు చేస్తే ముస్లిం యువకులపై కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలోని జామియా మసీద్ వద్ద శుక్రవారం ముస్లింలు నవజవాన్ కమిటీ ఇన్‌చార్జి అహ్మద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహ్మద్ ప్రవక్త పేరుతో కూడిన పోస్టర్లు ప్రదర్శిస్తూ మజీద్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జామా మసీద్ అధ్యక్షుడు మహ్మద్ మసూమ్, మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్, ఎంఎ పాషా, జబ్బార్, నయీమ్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'లో భాగస్వాములవ్వాలి

- అధికారులు, అధ్యాపకులు
- పచ్చదనం, స్వచ్ఛదనంపై అవగాహన ర్యాలీలు

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలని ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, తహసీల్దార్ ఫహీమ్ ఖాద్రిలు కోరారు. ఆమనగల్లు పట్టణంలో పర్యావరణం, పచ్చదనం, స్వచ్ఛదనం కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర, బాలికల, బస్టాండ్ పాఠశాలల అధ్యాపకులు, టీచర్లు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు.

చౌదరిగూడ : ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి పాటించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. జీహెచ్ఎం సునీత, ఎంపీవో హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి ఆనంద్ తదితరులున్నారు.

శంకర్‌పల్లి : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. శ్రీరేసు సత్తిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహారాజ్‌పేట్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఏపీవో నాగభూషణం, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, హెచ్ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులున్నారు.



ఇబ్రహీంపట్నం : మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక తదితరులు



మంచాల : రంగాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి కృష్ణారెడ్డి తదితరులు

షాబాద్ : ఎంపీడీవో అపర్ణ షాబాద్‌లోని పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ, బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి, మానవహారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పరిసరాల్లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఏపీవో వీరాసింగ్, హెచ్ఎం బాల్‌రాజ్, బీజేపీ మండలాధ్యక్షుడు మాణయ్య, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి, రాము, హరీష్, మహేష్, నాయకులున్నారు.

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, సోలీసిస్ సంయుక్త ఆధ్వర్యంలో వినోభానగర్‌లోని నూతన డిగ్రీ కళాశాల భవన సముదాయంలో వేయి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రొ.విద్యాసాగర్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.రమేష్, డా.చింతల రాకేష్ భవాని, డా.రచన, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ భూపాల్‌రాజు, సోలీసిస్ ప్రతినిధి రఘు ఉన్నారు.

మంచాల : రంగాపూర్, జాపాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత-స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ముఖ్యకార్య నిర్వహణాధికారి కృష్ణారెడ్డి, ఎంపీడీవో బాలశంకర్, తదితరులు ఉన్నారు.

కేశంపేట : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీవో కిష్టయ్య, హెచ్ఎం విద్యావతి, హౌసింగ్ ఏఈ కిషన్, కార్యదర్శి విద్యావతి పాల్గొన్నారు.

కొందుర్గు : ప్రతీఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. సేవా పక్వాడ్ మండల కన్వీనర్ కొమరబండ శ్రీశైలం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బల్వంత్‌రెడ్డి, బోయ అశోక్, చందు, కార్తిక్, గణేష్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యం బాగుంటుందని బీజేపీ శంకర్‌పల్లి పట్టణ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. పీహెచ్‌సీ వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులున్నారు.



శంకర్‌పల్లి : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో వెంకయ్యగౌడ్

క్రైం కార్నర్

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా.. ఒకరి మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి ఒకరు మృతిచెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తలకొండపల్లి మండలం మాదాయిపల్లి సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో సిమెంట్ ఇటుకలు నింపుకొని తలకొండపల్లి మండలం మాదాయిపల్లికి వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన దుద్దుకూరి జంగయ్య (50)అక్కడికక్కడే మృతిచెందగా మిడ్జిల్‌కు చెందిన వానరాసి యాదమ్మ, కపర రాములమ్మ, కపర సాయిలు, కపర లక్ష్మీలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు జంగయ్య కుమారుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితుడి రిమాండ్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న రాత్రి ఇబ్రహీంపట్నం బస్టాండులో ఓ యాచకురాలిపై లైంగికదాడికి పాల్పడ్డ నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు మంచాల మండలం నోములకు చెందిన పల్లాటి రవీందర్(38)గా గుర్తించారు. వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్ అయిన అతను.. మద్యం మత్తులో యాచకురాలిపై అత్యాచారినికి ఒడిగట్టాడు. బస్టాండు వెనక ఓ వరండాలో ఒంటరిగా నిద్రిస్తున్న యాచకురాలిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈక్రమంలో అడ్డుకున్న ఆమెను తీవ్రంగా గాయపరిచాడు. ఈమేరకు బస్టాండులో ఉన్న సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- బంగారం, వెండి, నగదు అపహరణ

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని న్యూబాగ్యనగర్ కాలనీలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కథనం మేరకు.. కాలనీలో నివాసముండే శ్రీనివాస్ విద్యుత్ శాఖలో లైన్‌మన్. కుటుంబ సభ్యులతో కలిసి వనపర్తిలో జరిగిన కార్యక్రమానికి వెళ్లారు. గుర్తుతెలియని దొంగలు గురువారం రాత్రి తాళం విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా పగులగొట్టి 12 గ్రాముల బంగారు గొలుసు, కిలోన్నర వెండి, రూ.78వేలు అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం ఇంటికొచ్చిన శ్రీనివాస్ దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీంతో పోలీసులు విచారణ చేపట్టారు. అయితే, దొంగతనం జరిగిన ఇంటి పక్కన నిర్మాణంలో ఉన్న ఇంట్లో విద్యుత్ వైర్లను కూడా దుండగులు అపహరించుకుపోయారు. నలుగురు దొంగలు కాలనీలో సంచరించినట్లు సీసీటీవీ ఫుటేజీలో నమోదైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



చందన్‌వెల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్

ప్రతీ పల్లెను అభివృద్ధి చేస్తాం

షాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ పల్లెను అభివృద్ధి చేస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని చందన్‌వెల్లి గ్రామంలో శుక్రవారం రూ.5లక్షలతో సీసీ రోడ్డు, రూ.2లక్షలతో మురుగు కాల్వల నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్‌లతో కలిసి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ ప్రజలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి వైపు దూసుకుపోతుందన్నారు. మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, బేగరి యాదయ్య, మహేందర్‌గౌడ్, రవీందర్‌నాయక్, వేమారెడ్డి, యాద య్య, రాహుల్, ప్రభాకర్‌రెడ్డి, సూర్యగౌడ్, రాఘవేందర్, కిషోర్, మాధవరెడ్డి, గౌరీ, బాల్‌రెడ్డి, రామస్వామి, అంజయ్యగౌడ్, శ్రీనివాస్, శేఖర్ తదితరులున్నారు.

పట్నం పాత బస్టాండుకు బస్సులు నడపాలి



బస్ డిపో ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పాత బస్టాండుకు ఆర్టీసీ బస్సులు నడపాలంటూ శుక్రవారం బీజేపీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో బస్ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. గతంలో మాదిరిగా సిటీ బస్సులు పాత బస్టాండుకు రావాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందికపోతే ఆందోళన ఉధృతం చేస్తామంటూ హెచ్చరించారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు నాయిని సత్యనారాయణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, టేకుల రాంరెడ్డి, రాఘవేంద్రస్వామి, శ్రీనివాస్ యాదవ్, ఆకుల సంతోష్, మైలారం శివ, శశిధర్‌రెడ్డి తదితరులున్నారు.

దాడులను నిరసిస్తూ న్యాయవాదుల విధుల బహిష్కరణ



షాద్‌నగర్ కోర్టు సముదాయం ఎదుట నిరసనలో న్యాయవాదులు

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శుక్రవారం షాద్‌నగర్ న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ పిలుపు మేరకు షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలులోకి తెచ్చేవరకు పోరాటం కొనసాగాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు రక్షణ, హక్కుల సాధన కోసం చేపట్టే ఉద్యమానికి సంపూర్ణ మద్దతునిస్తామని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. అలాగే న్యాయవాదులు అనికుమార్, హనుమాన్ నాయక్‌లపై దాడులు చేసిన వారిని కఠిన శిక్షించాలని కోరుతూ ఆమనగల్లు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్‌గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వస్పుల మల్లేశ్, సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, సభ్యులు లింగంగౌడ్, మధుగౌడ్, గణేశ్ గౌడ్, జగన్ గౌడ్, మహేశ్, శ్రీనివాస్, సర్ధార్‌నాయక్, శ్రీశైలం, మురళీకృష్ణ, తదితరులున్నారు.



ఆమనగల్లు : నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

దివ్యాంగులకు దసరా కానుక

(ఐదో పేజీ తరువాయి)

మాత్రమే అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో సుమారు 25వేల మంది దివ్యాంగులు పింఛన్ పొందుతున్నారు. మరో 25వేల మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఆన్‌లైన్ కష్టాలు, ధ్రువపత్రాల జారీలో తప్పులు, సకాలంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం లాంటి సమస్యలతో సతమతమవుతున్నారు. అవిటితనంతో బాధపడుతూ అధికారుల చుట్టూ తిరగలేకపోవడం, మారుమూల ప్రాంతాల్లో ఉన్న దివ్యాంగులు దూరభారంతో సదరం కేంద్రాలకు వెళ్లలేకపోతున్నారు. అయితే, జిల్లాలో 50వేల మందికి కలిపి కేవలం రెండు సదరం కేంద్రాలు ఉండటంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారు దూరభారంతో హైదరాబాద్‌లో ఉన్న సదరన్ సెంటర్‌లకు వెళ్లలేక పింఛన్‌లను సైతం వదులుకుంటున్నట్లు సమాచారం. షాద్‌నగర్‌లో సదరం సెంటర్ ఏర్పాటైతే వెళ్లి రావడానికి సులువుగా ఉంటుందని దివ్యాంగులు ఈ సందర్భంగా అభిప్రాయపడుతున్నారు.

షాద్‌నగర్ అసెంబ్లీ పరిధిలో 8వేల మంది

షాద్‌నగర్ అసెంబ్లీ పరిధిలో 6 వేల మంది దివ్యాంగులున్నారు. వీరంతా ప్రతీ సమస్యకు హైదరాబాద్ వెళ్లాలంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దగ్గర మొర పెట్టుకున్నారు. వారి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే వీర్లపల్లి.. షాద్‌నగర్ పట్టణంలో సదరం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారు. పలుమార్లు ఈ విషయాన్ని సెర్ప్ సీఈవో దివ్య దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆమె కూడా షాద్‌నగర్‌లో సదరం సెంటర్‌ను ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో షాద్‌నగర్ పట్టణంలో సదరం కేంద్రాన్ని మంజూరు చేస్తూ శుక్రవారం జీవో విడుదల చేశారు.

ఎమ్మెల్యేకు అభినందనలు



దివ్యాంగుల సమస్యలను గుర్తించి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ పట్టణంలో సదరం కేంద్రాన్ని ఏర్పాటు చేయించడం అభినందనీయం. దీనివల్ల ప్రతీ చిన్న విషయానికి హైదరాబాద్‌కు వెళ్లడం తప్పుతుంది. అర్హులైన దివ్యాంగులకు పింఛన్ వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే సదరం సెంటర్‌లో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలి. సమస్యలు వెంటనే పరిష్కారయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నో ఏండ్ల కల ఫలిస్తుందన్నందుకు సంతోషంగా ఉంది.

- ఆశన్నగారి భుజంగరెడ్డి, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు



కార్యదర్శికి వినతిపత్రమిస్తున్న గ్రామస్తులు

దాసర్లపల్లి కారోబార్‌ను తొలగించాలి

కందుకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దాసర్లపల్లి కారోబార్ కారోబార్‌ను విధుల నుంచి తొలగించాలని గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మండలంలోని దాసర్లపల్లి కారోబార్ అవినీతికి పాల్పడి గ్రామస్తులను ఇబ్బందులకు గురిస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మాజీ సర్పంచ్‌లు పి.బాలమణి అశోక్, టి.దేవేందర్, మాజీ ఎంపీటీసీ టి.ఇందిరల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించి కారోబార్ మహేష్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కార్యదర్శి లావణ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామస్తులు శేఖర్, శివశంకర్‌గౌడ్, రహీజ్, కృష్ణ, వెంకటేష్, మహేందర్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ముందస్తు అరెస్టు

యాచారం/కేశంపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్లు నగరానికి వెళ్లకుండా శుక్రవారం ఉదయం యాచారం, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు ఐదుగురిని ముందస్తు అరెస్టుచేశారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అలాగే కేశంపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు కొడుపర్తి మమత, అమృత, గంప లక్ష్మీలను మందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రమిస్తున్న నాయకులు

మంచాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం నేతలతో కలిసి ఎంపీడీవో బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 12 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికీ పైప్‌లైన్లు బాగుచేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే మరమ్మతులు పూర్తిచేసి నీటిసరఫరా చేయాలని, లేదంటే ప్రజలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్‌రెడ్డి, కాళ్ల జంగయ్య, ఆవుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అటెండర్ మృతి



బాబుయాదవ్(ఫైల్)

కందుకూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న కడారి బాబుయాదవ్ అనారోగ్యంతో శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మహేశ్వరం మండలం తుమ్మలూరుకు చెందిన బాబుయాదవ్ గతేడాది నుంచి ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. పది రోజుల క్రితం అనార్యోంతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స అందించారు. కాగా, ఎంపీడీవో సరిత ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

'బతుకమ్మ' తెలంగాణ సంస్కృతికి ప్రతీక



కడ్తాల్ : దేవర చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుజాత, శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో సుజాతలు అన్నారు. మండల కేంద్రంలోని దేవర చెరువు వద్ద బతుకమ్మ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లను వారు శుక్రవారం పరిశీలించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శి అల్లాజీకి వారు సూచించారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు బ్రహ్మాచారి, రాజు, జీపీ సిబ్బంది ఉన్నారు.

ఆమనగల్లు : తెలంగాణలో బతుకమ్మ పండగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండగ అని ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి అన్నారు. విద్యార్థినీలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

షాబాద్ : తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతిక అయిన బతుకమ్మ పండుగను షాబాద్ మండల కేంద్రంలో రామాలయంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



షాబాద్ : బతుకమ్మ వేడుకలో మహిళలు

చౌదరిగూడ : తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ అని జిల్లేడ్ చౌదరిగూడ కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారి రాగసుధ అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ముందస్తు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం నిమజ్జనం చేశారు.

మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్ ఉదారత.. పాఠశాల ఆవరణలో మట్టిపోయించి చదును..



కేశంపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ తన ఉదారత చాటుకున్నాడు. మండల పరిధిలోని లేమామిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడ్డాయి. విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన గ్రామ మాజీ సర్పంచ్ ఎం. శ్రీశైలంగౌడ్ పాఠశాల ఆవరణలో శుక్రవారం మట్టి పోయించి చదును చేయించాడు.

'ఆత్మగౌరవ' సభకు తరలిన నాయకులు



కొత్తూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన లంబాడీల ఆత్మ గౌరవ సభకు స్థానిక గిరిజనులు భారీగా తరలివెళ్లారు. లంబాడీల మండల శాఖ అధ్యక్షుడు బాబురాజ్ నాయక్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు సోమ్లనాయక్, రవినాయక్, వెంకటేష్ తదితరులున్నారు.

పాడైన రోడ్లను బాగు చేయాలి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీలో వర్షాలకు పాడైన రోడ్లను బాగు చేయాలని శంకర్‌పల్లి పట్టణ బీజేపీ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి డిమాండు చేశారు. శంకర్‌పల్లి పట్టణంలోని సంగారెడ్డిరోడ్డులో గల పాడైన రోడ్డు వద్ద బీజేపీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం నిరసన తెలిపారు. నాయకులు వీరేందర్, లోకేష్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్, వెంకటేష్, రుక్మోద్దీన్, గణేష్ తదితరులు ఉన్నారు.

ఇకపై పగలూ, రాత్రి 'డ్రంకెన్ డ్రైవ్'

షాద్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం ప్రియులకు షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు షాక్ ఇస్తున్నారు. ఇక నుంచి పగలు.. రాత్రి అనే తేడాలేకుండా రోజూ డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి చటాన్‌పల్లి రైల్వే గేటు వద్ద డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి డ్రైవ్ చేయడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



ఎల్వోసీ అందిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మరింత మెరుగైన వైద్య సేవలందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. మండలంలోని మీర్కాన్‌పేటకు చెందిన డేరంగుల కిష్టమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమేరకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2లక్షల ఎల్వోసీని శుక్రవారం ఆమె నివాసంలో కిష్టమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. బీఆర్ఎస్ నాయకుడు బి.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

శంకర్‌పల్లి/షాద్‌నగర్ రూరల్/తలకొండపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, శంకర్‌పల్లి జోనల్‌స్థాయి కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. జన్వాడలోని పృథ్వి క్రికెట్ గ్రౌండ్లో శుక్రవారం శంకర్‌పల్లి జోనల్‌స్థాయి అండర్-14, అండర్-17 క్రికెట్ (బాలుర) సెలక్షన్ నిర్వహించారు. శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాలకు చెందిన సుమారు 300మంది విద్యార్థులు పాల్గొనగా.. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి 69వ స్కూల్ గేమ్స్ శనివారం ముగిశాయి. షాద్‌నగర్ పట్టణ శివారులోని ఇండియన్ హైట్స్ పాఠశాలలో ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు డివిజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో మనోహర్ తెలిపారు.

జోనల్‌స్థాయి పోటీలకు వెల్జాల స్కూల్ విద్యార్థులు

తలకొండపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు వెల్జాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం నిర్వహించిన మండస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-14కు పవన్, శివశంకర్, మధు, పవన్ తేజ, అండర్-17విభాగంలో రామకృష్ణ, వాలీబాల్ అండర్-14కు సాత్విక్, మారుతిలు ఎంపికైనట్లు హెచ్ఎం నసీమా సుల్తానా, పీడీ పరమేశ్‌లు తెలిపారు.

మహిళా శిశు సంక్షేమానికి పెద్దపీట



అంగన్‌వాడీ కేంద్రం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎగిరిశెట్టి సత్యం

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళా, శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.12 లక్షలతో నూతనంగా నిర్మించే అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శుక్రవారం సత్యం శంకుస్థాపన చేశారు. గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వింటర్ స్పెషల్ క్యాంపు



ర్యాలీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

మంచాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వింటర్ స్పెషల్ క్యాంపులో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అస్మత్‌పూర్‌లో శుక్రవారం విద్యావశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. నగరంలోని ప్రగ్న, లాలిత్యం హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ల బృందం వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జాతీయసేవా పథకంలో భాగంగా నగరంలోని ప్రభుత్వ సిటీ కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థులు నాలుగు రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో సేవాశిబిరాలు నిర్వహించారు. ఆరుట్లలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రీదేవి, సుదక్షణ, తిరుపతి, బి.కృష్ణ తదితరులున్నారు.